సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



ఈ పరిమళం ఎంతో ప్రత్యేకం

ప్రత్యేక అవసరాల పిల్లలు అగరబత్తీలు తయారు చేస్తున్నాయి. ఇవి ఆకట్టుకుంటున్నాయి.

- 8లో



ఆదిత్యా నమోస్తుతే

అరసవల్లి ఆలయం ఆదివారం కిక్కిరిసింది. భక్తులు పోటెత్తారు.

- 8లో



న్యూస్‌రీల్

సందడిగా సాగర తీరం



ప్రత్యేక పూజలు అందుకుంటున్న ఆదర్శమూర్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీ యువకులు గ్రామ పెద్దలు, బెహరాలు, పూజారులతో కలిసి రామాలయం వద్ద శ్రీరాముడి జెండాను ఆవిష్కరించారు. కల్యాణ వేడుకలలో భాగంగా ఆలయం వద్ద పందిరి రాట వేసి ముత్తైదువులు అంతా కలిసి గుమ్మాలు అర్పించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అలాగే గ్రామ దేవత బృందావతి అమ్మవారికి సైతం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ నవమి వేడుకల్లో ప్రధాన ఘట్టమైన సీతారాములు కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.

10న పాతపట్నంలో జాబ్‌మేళా

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పలు కంపెనీలు పాల్గొంటాయని, పదో తరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ చదివిన నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

'రఘువంశం' పుస్తకావిష్కరణ



రఘువంశం పుస్తకావిష్కరణ చేస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరంలో జరుగుతున్న శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కర్రి భాస్కరరావు అందించిన 'రఘువంశం' పుస్తకావిష్కరణ మందిరం ఉపాధ్యక్షులు పప్పు పతంజలి శాస్త్రి చేతులమీదుగా జరిగింది. పుస్తక పరిచయాన్ని డాక్టర్ సనపల నారాయణమూర్తి చేస్తూ మహాకవి వాల్మీకి మహర్షి తర్వాత అంతటి గొప్ప కవి కాళిదాసని, ఉపమానం చెబితే కాళిదాసే చెప్పాలని అన్నారు. ఈ పుస్తకంలో 20 అంశాలు అన్ని విషయాలను స్పృశిస్తూ రచయిత అందించారని అన్నారు. కార్యక్రమంలో చాగంటి బాపయ్యపంతులు, పట్నాయిక్, మందుల మోహనరావు, కోమలరావు, నిష్టల నరసింహమూర్తి, వెంకటరమణ, ఈశ్వరరావు, మల్లేశ్వరరావు, కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, సీత, పద్మావతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణలో లోపాలున్నాయి'



సమావేశంలో పాల్గొన్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎస్సీ వర్గీకరణ చేయటంలో అనేక లోపాలున్నాయని, సమగ్ర సమాచారం లేకుండా అసంపూర్తిగా ఉందని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు అన్నారు. ఈ మేరకు ఆదివారం అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులంలో కొందరిపై కక్ష కట్టి వర్గీకరణ చేయడం వెనుక ప్రభుత్వ దురుద్దేశం ఉందన్నారు. సరైన డేటా లేకుండా, కనీసం అసెంబ్లీలోనూ, శాసన మండలిలోనూ, చర్చించకుండా నిరంకుశంగా తప్పుడు సమాచారం ఆధారంగా వర్గీకరణ చేయడం సరికాదన్నారు. జిల్లాల యూనిట్‌గా వర్గీకరణ చేయాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని, జోనల్ స్థాయిలో ఏ విధంగా రిజర్వేషన్లు అమలు చేస్తారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరిగే విధానంలో లోపాలపై ఇంప్లీడ్ పిటిషన్లు వేసి వర్గీకరణ రద్దయ్యే వరకు కోర్టు ద్వారా పోరాటం చేస్తామన్నారు. లేదంటే భవిష్యత్‌లో ఎస్సీల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోతల దుర్గారావు, లింగాల అప్పన్న, అంపోలు ప్రతాప్, నూతలపాటి భరత్ భూషణ్‌రాజ్, దండాసి రాంబాబు (జాన్), డి.రామప్పడు, ధర్మాన గణేష్, సీర రమేష్ బాబు, పడాల ప్రతాప్ కుమార్, కరగాన దామోదర్ రావు, కన్నేపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో కల్యాణానికి హాజరైన భక్తులు



శ్రీకాకుళం కోదండ రామాలయంలో ఉత్సవ మూర్తులు, తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



శ్రీకాకుళంలోని ఉమారామలింగేశ్వర ఆలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



జలుమూరు: హరిక్రిష్ణమ్మపేటలో తిరువీధి



కాశీబుగ్గ: పలాస రామాలయంలో భారీ అన్నదానం

లోకాభిరామం.. శ్రీరామం

రాముడు సీతారాముడుగా మారిన వేళ.. జానకి రామచంద్రుడి ప్రాణ నాయకిగా మారిన సమయాన.. మందిరాలు మంటపాలుగా మారాయి. తలంబ్రాల తంతు జరుగుతుంటే భక్తులంతా మురిసిపోయారు. జీలకర్ర బెల్లం పెడుతుంటే రెప్ప వాల్చకుండా చూసి తరించారు. పుస్తెలతాడును అలా పురోహితుడు చూపించి సీతమ్మ మెడలో అలంకరిస్తుంటే.. రాముడి పెళ్లిని తామే చేసినంత ఆనందంలో మైమరిచిపోయారు. శ్రీరామ నవమి నాడు సీతారాముల కల్యాణాలు వైభోగంగా జరిగాయి.

సాయం ఉంటే బాగుండేది



ఏడాదంతా పోడు పంటలే మాకు ప్రధాన జీవనాధారం. మా పూర్వీకుల నుంచి పోడు పంటలు ఎలా సాగు చేయాలి, సీజన్‌తో వచ్చే కార్తెల్లో ఎలాంటి పంటలు వేసుకోవాలో అలవాటు చేసుకున్నాం. తక్కువ పెట్టుబడితో పాటు పూర్తిగా పెట్టుబడి లేకుండా దిగుబడినిచ్చే పంటల్లో పసుపు, సీతాఫలం, జీడి, పైనాపిల్, కందులు, కొండచీపుర్లు, అరటి, బొప్పాయి ఉంటాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత పెట్టుబడి సాయం లేదు. – సవర గంగయ్య, గిరిజన రైతు, మురగడలోవ

మార్కెట్ సదుపాయం కల్పించాలి



గిరిజనులు పండించే పంటను అమ్ముకునేందుకు మార్కెట్ సదుపాయం కల్పించాలి. రవాణా, సరుకు నిల్వ ఉంచే గిడ్డంగులు, మార్కెట్ సదుపాయం లేకపోవటం వల్ల కొన్ని సందర్భాల్లో పండించిన పంటను తక్కువ ధరకు విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నాం. కొన్ని రకాల పంటలు నిల్వ చేసుకునేందుకు శీతల గిడ్డంగులను నిర్మించాలి.

– సవర వెంపయ్య, గిరిజన రైతు, సూదిరాయిగూడ, ఎల్.ఎన్.పేట



పోడు పంటగా కందిసాగు

కొండే అండ



రోడ్డు పక్కన సీతాఫలం విక్రయిస్తున్న గిరిజనులు



ఘాటైన ధర పలికే సీమమిరప

- పోడు పంటలపై ఆధార పడుతున్న గిరిజనులు
- ఏడాది పొడవునా పంట చేతికందేలా సాగు
- ప్రభుత్వ సాయం లేదంటున్న అడవి బిడ్డలు

ఎల్ ఎన్ పేట:

సీతంపేట సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజనులకు కొండే అండగా నిలుస్తోంది. వీరు కొండపోడు భూములను సాగు చేసి పలు రకాల పంటలు పండిస్తుంటారు. కొండపోడు భూముల్లో గిరిజన కుటుంబాలు ఏడాది పొడవునా ఏదో ఒక పనిచేస్తూనే ఉంటాయి. పంట పండించేందుకు గిరిజనులు ఎంతగా శ్రమిస్తారో పంట దిగుబడులు, వాటి ద్వారా ఆర్థికంగానూ అంతే లాభం పొందుతారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పంట పెట్టుబడికి సాయం లేదని, మార్కెట్ సౌకర్యం లేకపోవటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజన రైతులు వాపోతున్నారు.

పండించే పంటలు..

కొండ పోడులో ఏడాది పొడవునా ఏదో ఒక పంట దిగుబడి వచ్చేలా గిరిజనులు ముందుగానే పథకం (ప్రణాళిక) సిద్ధం చేసుకుంటారు. ఆర్థికంగా ఆదుకునే పంటల్లో పసుపు, కందులు, జీడి, సీతాఫలం, పైనాపిల్, పనస, చింతపండు, కొండ చీపుర్లు పంటివి ప్రధానమైనవి. వీటితో పాటు మామిడి, బొప్పాయి, అరటి, నిమ్మ, జునుము, చీమ మిరప, మునగ, సపోటా, రామఫలం, కర్రపెండ్లం, చీమపెండలంతో పాటు పలు రకాల కూరగాయలు, పువ్వులు, రాగులు, జొన్నలు, కొర్రలు వంటి కొన్ని రకాల చిరుధాన్యాలు ఎక్కువగా పండిస్తుంటారు. పండించిన పంటలను గిరిజనులే మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకుంటారు. గిరిజన పంటలు అమ్ముకోవటంలో దళారీ వ్యవస్థ తక్కువగానే ఉంటుంది.

ప్రతిరోజూ వ్యాపారం

గిరిజనులు పండించే పంటలను ప్రతీ రోజూ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. సీజన్‌తో పనిలేకుండా ఏదో ఒక పంట చేతికి అందుతుంది. వీరు మార్కెట్‌కు వచ్చే సమయంలో ఒకటి, రెండు రకాల పంటలను అమ్మకానికి తీసుకువస్తారు. ప్రతి రోజూ వ్యాపారం చేయటం వలన వీరికి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గిరిజనులు పోడు పంటలను ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లగేజీ వ్యాన్లతోను సమీపంలో జరిగే వారపు సంతలకు, మండల కేంద్రాలకు, ప్రధాన కూడళ్లకు తీసుకుని వెళ్లి విక్రయిస్తారు. సహజ సిద్ధమైనవి కావడంతో గిరాకీ కూడా బాగుంటుంది.

'డైట్'లో అధ్యాపక ఖాళీల భర్తీ

- ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- 16, 17వ తేదీల్లో రాత పరీక్ష, 19న ఇంటర్వ్యూల నిర్వహణ
- డిప్యుటేషన్ విధానంలో 5 సీనియర్ లెక్చరర్స్, 17 లెక్చరర్స్ పోస్టుల భర్తీ



డాక్టర్ తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని వమ్మరవల్లి డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని ఫారిన్ సర్వీస్ నియామక నిబంధనల మేరకు డిప్యుటేషన్ పద్ధతిలో నియామకం చేయనున్నట్టు జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తాజాగా విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ/జిల్లా పరిషత్/మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తూ.. ఆసక్తి కలిగిన స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వమ్మరవల్లి డైట్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 5 సీనియర్ సీనియర్ లెక్చరర్ల పోస్టులు, మరో 17 లెక్చరర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. డీడీఓల ద్వారా సంబంధిత హెచ్‌ఎంలు, ఎంఈఓలు, డీఈఓల ద్వారా డైట్ ప్రిన్సిపాల్‌కు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు 2025 మార్చి 31వ తేదీ నాటికి 58 ఏళ్లలోపు ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం, ఎంఈడీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసి ఉండాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 10వ తేదీతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగుస్తుందని, ఈనెల 11 నుంచి 13వ తేదీల మధ్యలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని, అర్హత పొందిన దరఖాస్తుదారులకు ఈ నెల 16, 17వ తేదీల్లో రాత పరీక్ష జరుగుతుందని, 19వ తేదీన ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి డిప్యుటేషన్ ఉత్తర్వులు ఈ నెల 21వ తేదీన అందజేయనుండగా, 22న విధుల్లో చేరాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు, దరఖాస్తు ఫారం కోసం 'డీఈఓ శ్రీకాకుళం ఓఆర్జీ' వెబ్‌సైట్‌ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

సాగునీటి కాలువ ఆక్రమణ



సాగునీటి కాలువను ఆక్రమించి వేసిన లేఅవుట్

సంతబొమ్మాళి: రియల్ ఎస్టేట్ వ్యాపారుల దౌర్జన్యం రైతుల పాలిట శాపంగా మారింది. కల్వర్టులు కప్పేసి, సాగునీటి కాలువ ఆక్రమించుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నౌపడ నుంచి టెక్కలి వైపు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఇజ్జువరం పంచాయతీ రైల్వేగేట్‌కు సమీపంలో సర్వే నంబర్ 355–1ఈ–355–1ఎఫ్‌లో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్‌ను వేశారు. ఈ లేఅవుట్‌లో గ్రావెల్ వేసి ఎత్తు చేసే క్రమంలో సాగునీటి కాలువను కప్పేసి దర్జాగా లే అవుట్‌లో కలిపేశారు. అంతటితో ఆగకుండా సాగునీరు ప్రవహించే కల్వర్టును కూడా కప్పేశారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఖరీఫ్‌లో తమ పొలాలకు నీరెలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. వంశధార అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు ఇచ్చినా అవేమీ పట్టించుకోకుండా వారు తమ పనిని కొనసాగిస్తున్నారు. దీనిపై సంతబొమ్మాళి ఏఈ కె.అప్పలరెడ్డి మాట్లాడుతూ సాగునీటి కాలువ ఆక్రమించి కల్వర్టును కప్పేయడంతో సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు ఇచ్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పలాస కిడ్నీ ఆస్పత్రిలో పోస్టులకు దరఖాస్తుల వెల్లువ



కాశీబుగ్గ: పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ విధానంలో తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 6వ తేదీతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిసిన నేపథ్యంలో ఇప్పటివరకు మొత్తం 267 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ దరఖాస్తుల్లో జనరల్ డ్యూటీ అటెండెంట్స్ పోస్టులకు 81 మంది, సీ–ఆర్మ్ టెక్నీషియన్ పదవులకు 16 మంది, డయాలసిస్ టెక్నీషియన్ పోస్టులకు 26 మంది, రిసెప్షన్ కమ్, రిజిస్ట్రేషన్ క్లర్క్ ఉద్యోగానికి అత్యధికంగా 86 మంది, సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగానికి 15 మంది దరఖాస్తు చేసినట్లు ఆమె వివరించారు.



ధోనీని కలిసిన విజయ్

ఐపీఎల్‌లో ఢిల్లీ తరఫున ఆడుతున్న టెక్కలి క్రీడాకారుడు త్రిపురాన విజయ్ సీఎస్‌కే ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీని కలిశాడు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ధోనీని కలిసి కొన్ని సూచనలు తీసుకున్నారు.

– టెక్కలి

వెంటాడిన మృత్యువు

- జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం
- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం



మృతుడు హరిప్రసాద్ (ఫైల్)



బస్సు కింద నలిగిపోయిన హరిప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్

కేశవరావుపేట పంచాయతీ పరిధి కింతలి మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్వా హరిప్రసాద్ (23) అనే యువకుడు మృతి చెందారు. వెనుక కూర్చున్న జలుమూరు వేణు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

శ్రీకాకుళం నుంచి వీరిద్దరూ డ్యూక్ బైక్‌పై ఎచ్చెర్ల వైపు వస్తున్నారు. కింతలిమిల్లు నుంచి వీరు కొన్ని సెకన్ల వ్యవధిలో సర్వీస్ రోడ్డుకు వెళ్లనున్నారు. ఈ క్రమంలో ముందు వెళుతున్న వ్యానును బైక్‌తో ఢీకొట్టారు. దీంతో బండి అదుపు తప్పి ఓ లారీని తాకింది. దీంతో ఇద్దరూ బైక్‌పై నుంచి తుళ్లి పడిపోయారు. అదే సమయానికి అటుగా ఆర్టీసీ బస్సు వస్తుండడంతో సరిగ్గా బస్సు వెనుక చక్రం కింద పడిపోయారు. టైరు శరీరం మీద నుంచి వెళ్లిపోవడంతో హరిప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. వేణు కళ్లు, ఇతర శరీర భాగాలపై నుంచి బస్సు టైరు వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి 108 సాయంతో అతడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. హరిప్రసాద్ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఆర్టీసీ బస్సును స్టేషన్‌కు తరలించారు. బస్సులో ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్‌తో కూడిన పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కరించి, సహాయ చర్యలు చేపట్టారు.

వీరే ఆధారం..

మృతి చెందిన బస్వా హరిప్రసాద్ శ్రీకాకుళం పట్టణంలో బంగారు దుకాణంలో పని చేస్తున్నాడు. తల్లి రమణమ్మ వస్త్ర దుకాణంలో చేస్తుంది. కష్టాన్ని నమ్ముకుని వీరు బతుకుతున్నారు. తండ్రి కుంటుంబానికి దూరంగా ఉన్నా తల్లి పిల్లలను పెంచి పెద్దచేసింది. మృతునికి దిలీప్ అనే అన్నయ్య ఉన్నారు. హరి మృతితో జరజాం గ్రామంలో విషాదం అలముకుంది.

అలాగే గాయపడిన వేణుది ఎచ్చెర్ల గ్రామం. పాలిటెక్నిక్ డిప్లమా పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. హరి, వేణులు ప్రాణ స్నేహితులు. వేణు తండ్రి గోపి ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవారు. 2020లో కోవిడ్‌తో మృతి చెందాడు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వెళ్లారు. అతివేగం, ప్రమాద సమయంలో బండిపై నియంత్రణ కోల్పోవడం ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. రోడ్డు ప్రమాదంపై ఎచ్చెర్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన వేణును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో మాజీ మంత్రి కొట్టు



కొట్టు సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆలయ విశిష్టత, పర్వ దినాలపై వివరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన రిటైర్డ్ ఆడిట్ అధికారి వలివేటి శ్రీదేవి తన అన్నయ్య దివంగత జయరామారావు పేరిట రూ.1,00,001 విరాళాన్ని ఈవో వై.భద్రాజీకి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రూ.లక్ష అంతకు మించి విరాళాలు ఇచ్చిన దాతలకు పర్వదినాల్లో విశిష్ట దర్శనం కోసం పాస్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



పోటీలో క్రీడాకారులు

గార: అంపోలు జెడ్పీ హైస్కూల్ మైదానంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 8న జరగనున్న గ్రామదేవత ఉత్సవాలు (శివయ్య పండగ) సందర్భంగా స్థానిక యువత ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఉదయం పోటీలను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్, సర్పంచ్ గొండు జయరాం, గొండు అచ్యుతరావు, వెలమల శ్రీనువాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఇటువంటి క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు.

విద్యార్థి నిజాయితీ



ఆకాష్‌కు సెల్ అందిస్తున్న చంటి

ఇచ్ఛాపురం టౌన్ : పట్టణంలోని గిలాయి వీధికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి బి.చంటి తనకు దొరికిన సెల్‌ఫోన్‌కు పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. ఆదివారం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా చంటికి సెల్‌ఫోన్ దొరికింది. అక్కడ వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఇంటికి వెళ్లి తన తండ్రి శ్రీనివాస్‌కు విషయం చెప్పాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ ఎం.చిన్నమనాయుడుకు ఫోన్‌ను అప్పగించాడు. పట్టణంలోని డబ్బూరివీధికి చెందిన పి.ఆకాష్ ఫోన్‌గా గుర్తించి విద్యార్థి చేతుల మీదుగా ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చంటిని సీఐ, పట్టణ ఎస్‌ఐ ఎం.ముకుందరావు అభినందించారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సంగీత విభావరి నిర్వహించారు. డి.రామారావు ఆధ్వర్యంలో మహిళలు శ్రీరాముడి కీర్తనలు, గీతాలను చక్కగా ఆలపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈ పరిమళం.. ఎంతో ప్రత్యేకం



అగరబత్తీలను తయారుచేస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలు

స్ఫూర్తి

- అగరబత్తీలు తయారుచేస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలు
- సహజ సిద్ధంగా లభించే పూలతో తయారీ
- దివ్యాంగుల మనోవికాసానికి కృషి చేస్తున్న నిర్వాహకులు



పూలరెక్కలను ఆరబెట్టిన దృశ్యం



ఆరబెట్టిన పూలను మిషన్‌లో వేసి పౌడర్‌గా చేస్తున్న దృశ్యం



తయారైన అగరబత్తీలు, ధూప్‌స్టిక్స్

శ్రీకాకుళం కల్చరల్:

వారంతా మానసిక దివ్యాంగులు. సొంతంగా ఆలోచించే శక్తి తక్కువ. అయితే నేం.. తమను ప్రోత్సహిస్తే సకలాంగులకు ఏమాత్రం తీసిపోమని నిరూపిస్తున్నారు. సహజ సిద్ధ వనరులను ఉపయోగిస్తూ అగరబత్తీలు, ధూప్ స్టిక్స్, రంగులు, దీపావళి ప్రమిదలు తయారు చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని బెహరా మనోవికాస కేంద్రంలో 74 మంది బుద్ధిమాంద్యం గల వారు ఉన్నారు. వీరికి కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక శిక్షణలు ఇచ్చి వారిలో మానసిక స్థైర్యం పెంపొందిస్తున్నారు.

ప్రత్యేక శిక్షణ..

బెహరా మనోవికాస కేంద్రంలో క్రాఫ్టిజెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పర్యావరణ హాని లేని వస్తువుల తయారీపై శిక్షణ ఇప్పించారు. స్కిల్లింగ్ అనే కార్యక్రమం ద్వారా అగరబత్తీల తయారీ, హోలి రంగులు, కొవ్వొత్తులు, పేపర్ బ్యాగులు వంటి ఉత్పత్తులను ఏ విధంగా తయారు చేయాలో నేర్పించారు. ప్రధానంగా అగరబత్తీలను తయారు చేయడంలో ఇక్కడి చిన్నారులు ప్రావీణ్యం సంపాదించారు.

అగరబత్తీ తయారీ ఇలా..

అగరబత్తీని తయారు చేసేందుకు పెద్ద మొత్తంలో వివిధ రకాల పూలు సేకరిస్తారు. గాలిలో బాగా ఆరబెట్టి పూర్తిగా ఎండాక మిషన్‌లో వేసి పౌడర్‌గా తయారు చేస్తారు. అందులో మిక్సింగ్ పౌడర్, ఎసెన్స్ కలిపి ముద్దగా చేస్తారు. దానిని పుల్లలకు చుట్టి నీడలో ఆరబెడతారు. పూర్తిగా ఎండిపోయాక 50 పుల్లలను ఒక ప్యాకెట్‌గా సిద్ధం చేస్తారు. వీటితో పాటు ధూప్ స్టిక్స్ కూడా తయారు చేస్తున్నారు. ఒక ప్యాకెట్ ధర రూ.30, ధూప్ స్టిక్స్ ప్యాకెట్ రూ.15గా అమ్మకం చేస్తున్నారు. వీరు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ చేయడానికి కూడా సంస్థ ప్రతినిధులు సహకరిస్తున్నారు. దీంతో పిల్లలకు శారీరక, మానసిక ఉల్లాసం కలిగి వారి ఆరోగ్యం కొంత మెరుగుపడటంతో పాటు కొంత ఆర్థిక స్వావలంబన చేకూరుతోంది.



పూలను వేరు చేస్తున్న దివ్యాంగులు

శిక్షణ ఇచ్చారు



అగరబత్తీల తయారీకి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అందరం కలసి నేర్చుకున్నాం. హోలీ రంగులు కూడా తయారు చేస్తాం. వీటిని చేసేటప్పుడు ఆసక్తికరంగా ఉంటుంది.

– సాయితేజ, బెహరా మనోవికాస కేంద్రం

ఎండిన పూలతో..



ఎండిన పూలను మిషన్‌లో వేసి పౌడర్ చేస్తాను. ఒకే రంగులో ఉన్నవి ఒకేసారి మిషన్‌లో వేస్తాం. అలా రకరకాల పౌడర్లు సిద్ధం చేసి అగరబత్తీలు చేయడం బాగుంది.

– శివ, బెహరా మనోవికాస కేంద్రం

ఉత్సాహంగా ఉంది..



అగరబత్తీలు చేయడం ఉత్సాహాన్నిస్తోంది. పూల పౌడర్‌ను ఎసెన్స్‌తో కలిపి ముద్దను తయారు చేసి తర్వాత పుల్లలతో అగరబత్తీను తయారు చేస్తాం.

– గోపి, బెహరా మనోవికాస కేంద్రం

మానసిక ఎదుగుదలకు కృషి



ప్రత్యేక అవసరాల పిల్లల మెదడుకు పదును పెట్టి సృజనాత్మకత పెంచేందుకు వివిధ వస్తువుల తయారీలో శిక్షణ ఇస్తున్నాం. ఇక్కడి వచ్చే సందర్శకులు వీటిని కొనుగోలు చేస్తుంటారు. ఇలా చేయడం ద్వారా మానసిక దివ్యాంగులకు ప్రోత్సాహం అందించిన వారవుతారు.

– శ్యామల, మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు

ఆదిత్యా నమోస్తుతే..!



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- విధుల్లోకి దినసరి వేతనదారులు



ప్రసాదాలను విక్రయిస్తున్న దినసరి వేతనదారులు

అరసవల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) జరుగుతున్న క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణి వద్ద సంప్రదాయక పూజలు నిర్వహించి ప్రసాదాలను స్వామికి నివేదించారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాలు పూజలు చేయించుకున్నారు. ఎండ వేడిమి తీవ్రంగా ఉన్న కారణంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయించారు.

విధుల్లోకి సిబ్బంది..

శనివారం విధులకు దూరంగా ఉన్న దినసరి వేతనదారులు ఆదివారం మాత్రం విధులకు వచ్చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన క్రమంలో వారికి సౌకర్యాల కల్పన నుంచి ఆలయంలో క్యూలైన్ల ఏర్పాటు, అన్నదానం, ప్రసాదాల తయారీ, విక్రయాలన్నీ దినసరి వేతనదారులే చూసుకున్నారు. ఈవో సూచన మేరకు ఈనెలాఖరు వరకు వేచిచూద్దామనే భావనను వ్యక్తం చేసి విధులను యధావిధిగా కొనసాగించారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,12,600, పూజలు, విరాళాల ద్వారా రూ.60,521, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1,15,880 వరకు ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు.

నిమ్మ @ రూ.110



శ్రీకాకుళం: వేసవి ఎండల నేపథ్యంలో జిల్లాలో నిమ్మకాయల ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. నెల రోజుల క్రితం రూ.50 నుంచి రూ.60 వరకు ఉన్న కిలో నిమ్మకాయల ధర ప్రస్తుతం రిటైల్‌లో రూ.110కు అమ్ముతున్నారు. హోల్‌సేల్‌లో రూ.95 వరకు ధర పలుకుతోంది. వేసవిలో నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉండటంతో ధర పెరగడం పరిపాటి. ఏటా ఏప్రిల్ మాసాంతం నుంచి జూన్ మొదటి వారం వరకు ధర పెరుగుతునే ఉంటుంది. ఈ ఏడాది మాత్రం మార్చి చివరి వారం నుంచి ధర విపరీతంగా పెరిగిపోయింది. జిల్లాలో నిమ్మ పంట అంతంతమాత్రంగానే సాగవుతోంది. గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిమ్మ దిగుమతి అవుతోంది. ఆయా ప్రాంతాల్లో ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా పడటం, మంచు ఎక్కువగా కురవడం వల్ల దిగుబడి తగ్గిపోయిందని, ఫలితంగా ధర పెరిగిపోయిందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. మే చివరి నాటికి కిలో నిమ్మ ధర రూ.150 దాటిపోవచ్చని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడు బలిన్ దుర

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధిలోని ఊసవానిపేట గేటు సమీపంలో ఆదివారం రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి ఒడిశా వైపు వెళ్లే రైలులో ప్రయాణం చేస్తున్న అసోంకు చెందిన బలిన్ దుర(35) ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ జారిపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబానికి సమాచారం అందించారు.

రామగిరి క్షేత్రంలో ఐటీడీఏ పీఓ



రామగిరి క్షేత్రంపైకి కాలినడకన వెళ్తున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

కొత్తూరు: మండలానికి ఆనుకుని ఉన్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలం పులిపుట్టి సమీపంలో ఉన్న కన్నెధార కొండపై నిర్మించిన రామగిరి క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. సీతారాములను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పీఓను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సీతారాముల కల్యాణోత్సవానికి కొత్తూరు, సీతంపేట మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలోహాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పిండి శ్రీనివాసరావు, రామగిరి క్షేత్రం కమిటీ అధ్యక్షుడు ఎస్పీ పెంటయ్య, జి.రాములునాయుడు, రాజారావు, రాములు, జి.ప్రసాద బాబు, భాస్కరరావు ప్రిన్సిపాల్ నవీన్ పాల్గొన్నారు.

8న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

రణస్థలం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఏపీ దళిత మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.బెంజమన్ పిలుపుమేరకు ఈ నెల 8న జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రణస్థలం మండల శాఖ అధ్యక్షుడు టొంపల సూరప్పడు తెలిపారు. ఈ మేరకు జె.ఆర్.పురం హైస్కూల్ వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి అధిక సంఖ్యలో ఎస్సీ సభ్యులు తరలివెళ్లి వర్గీకరణకు వ్యతిరేకమనే సంకేతాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికగా తెలియజేయాలని తీర్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో దళిత మహాసభ జిల్లా నాయకులు కుప్పిలి సీతప్పడు, జిల్లా ఉపాధ్యక్షులు దత్తి గోవింద, గౌరవ అధ్యక్షులు సాకేటి పోతయ్య, నాయకులు పల్ల నీలయ్య, కుప్పిలి పైడిరాజు, దుక్క ఆదినారాయణ, నడుపూరి ఆనంద్, సోమాధుల రమణ, లండ చినబాబు, యామల గోపాల్, బోనెల పరశురాం, మామిడి జగదీష్, ముక్కు రాము, కోండ్రు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం కిడ్నీ బాధితుడి పోరాటం



పలాస దయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రమణ

కాశీబుగ్గ: ఆయాసం వచ్చిందని పలాస కిడ్నీ పరిశోధన కేంద్రానికి వెళ్తే అత్యవసరంగా శ్రీకాకుళం వెళ్లిపోవాలని రిఫర్ చేయడం, అందుకు బాధితుడు అంగీకరించకపోవడం వివాదానికి దారితీసింది. ఇటీవల జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన టి.రమణ పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో కొన్నాళ్లుగా డయాలసిస్ సేవలు పొందుతున్నాడు. ఒక్కసారిగా ఆయాసం రావడంతో ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు అష్టకష్టాలుపడి చేరుకున్నాడు. అయితే అక్కడి నుంచి రిఫర్ చేసేందుకు వైద్యసిబ్బంది ప్రయత్నాలు చేశారు. ప్రాణాలు పోయినా ఇక్కడే వైద్యం పొందుతానని, శ్రీకాకుళం వెళ్లి వైద్యం పొందే స్థోమత తనకు లేదని రమణ తేల్చిచెప్పాడు. రిఫరల్ పేరుతో వైద్యం అందించకుండా పంపించేయడం తగదని వాపోయాడు. దీంతో సిబ్బంది చివరికి పలాస కేంద్రంలోనే చికిత్స చేసేందుకు అంగీకరించారు. కాగా, కిడ్నీ బాధితులు, వారి కుటుంబాలతో ఆస్పత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అధికారులు స్పందించి కౌన్సిలింగ్ ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వైన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలోని ఓ మద్యం షాపు నిర్వాహకుడిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాపర గ్రామానికి చెందిన కొందరు యువకులు మెళియాపుట్టిలోని మద్యం షాపులో నాలుగు బాటిళ్లు కొనుగోలు చేసి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత తిరిగి వచ్చి ఒక మద్యం బాటిల్ తిరిగి నిర్వాహకుడికి ఇచ్చి డబ్బులు అడిగారు. అందుకు ఆయన నిరాకరించడంతో వాగ్వాదానికి దిగారు. మద్యం మద్యం మత్తులో నిర్వాహకుడిపై దాడికి దిగి సీసాతో తలపై బలంగా మోదారు. అనంతరం పిడిగుద్దులతో దాడి చేశారు. నిర్వాహకుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురు యువకులపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

15లోగా పెద్దమార్కెట్ కూల్చేయండి

- కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఏకపక్ష నిర్ణయం
- మండిపడుతున్న వ్యాపారులు



మార్కెట్ అభివృద్ధి ప్రణాళికపై చర్చిస్తున్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు కూరగాయల మార్కెట్(పెద్ద మార్కెట్)ను ఈ నెల 15 లోగా కూల్చేయాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులు ప్రకటించడం వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరో వారం రోజులు మాత్రమే గడువు ఉండగా వ్యాపారాలను ప్రత్యామ్నాయ స్థలాల్లోకి మార్చాలని ఆదేశించడం ఏకపక్ష నిర్ణయమని పలువురు వ్యాపారాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దూడ భవానీశంకర్ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్ద మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీ పేరుతో పర్యటించి కోటి రుపాయలతో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. దానిని హామీగానే మిగిల్చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో 2004లో మార్కెట్ సమస్యను అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.4 కోట్లతో మార్కెట్‌ను అభివృద్ధి చేసిన విషయాన్ని వ్యాపార వర్గాలు ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుంటున్నాయి. వ్యాపారుల్లో రెండు వర్గాలు కోర్టులను ఆశ్రయించడం, కొందరు కుటిల రాజకీయాలు చేయడంతో మార్కెట్‌లోని 40 శాతం దుకాణాలు ఖాళీగా ఉండిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించి షాపులన్నీ అందుబాటులోకి తీసుకువస్తే సమస్య ఉండదు. అలాకాదని, అభివృద్ధి చేయడం మంచిదే అయినప్పటికీ వ్యాపార వర్గాలను సంప్రదించకుండా వారమే గడువిచ్చి షాపులు ఖాళీ చేయించాలని హుకుం జారీ చేయడం పట్ల వ్యాపార వర్గాలు బెంబేలెత్తిపోతున్నాయి. మార్కెట్లో వ్యాపారం చేస్తున్నవారు చాలా మంది నష్టాల బారిన పడి ఐపీ పెట్టి వెళ్లిపోవడం, కొందరు కనిపించకుండా పోవడం వంటి ఎన్నో జరిగాయి. ఇటువంటి వాటిని తలచుకొని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రానికి ఆదర్శంగా పొట్టిశ్రీరాములు మార్కెట్

శ్రీకాకుళం: నగరంలోని పొట్టి శ్రీరాములు కూరగాయల మార్కెట్‌ను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కేంద్ర రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు చెప్పారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. ఈ నెల 15లోగా ప్రత్యామ్నాయ స్థలంలోకి మార్చి యూ ఆకారంలో షాపులు నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మార్కెట్ అస్తవ్యస్తంగా ఉందని, వినియోగదారులు నడిచేందుకు, షాపింగ్ చేసేందుకు అనుకూలంగా లేదన్నారు. వ్యాపారులతో సదస్సు నిర్వహించి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించనున్నట్లు వివరించారు. మున్సిపాల్ కార్యాలయాన్ని ప్రజా భాగస్వామ్యంతో పునర్నిర్మిస్తామని, ఒక అంతస్తులో కార్యాలయం, మిగిన వాటిలో వ్యాపార సముదాయాలు ఉంటాయన్నారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లోకి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరావు, వర్తక సంఘం అధ్యక్షుడు కోరాడ హరగోపాల్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.